ప్రజాశక్తి

శనివారం 6 సెప్టెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వివాదాల పరిష్కారంలో..

మధ్యవర్తిత్వం కీలకం

- ప్రత్యామ్నాయ న్యాయ వ్యవస్థలు అందుబాటులోకి రావాలి
- ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
వివాదాల పరిష్కారానికి మీడియేషన్ (మధ్యవర్తిత్వం)లాంటి ప్రత్యామ్నాయ న్యాయ వ్యవస్థలు అందుబాటులోకి రావాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 'ఈజ్ ఆఫ్ జస్టిస్' వ్యవస్థతో సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. శుక్రవారం విశాఖలోని ఓ హోటల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన పూర్వీకులు, గ్రామపెద్దలు సమర్థవంతంగా మీడియేషన్ ప్రక్రియను నిర్వహించేవారని తెలిపారు. విశాఖపట్నంలో జ్యుడీషియల్, మధ్యవర్తిత్వ రంగాలపై చారిత్రాత్మక కాన్ఫరెన్స్‌ను నిర్వహించటం సంతోషదాయకమన్నారు. ప్రజాస్వామ్యంలో భారతీయ న్యాయ వ్యవస్థ ఓ మూల స్తంభం వంటిదని తెలిపారు. విశాఖలో ఎడిఆర్ ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం నమ్మకంతో కూడికున్నదని అన్నారు. మరో సుప్రీంకోర్టు న్యాయమూర్తి పిఎస్.నరసింహ మాట్లాడుతూ ఎపి వంటి రాష్ట్రాలకు మధ్యవర్తిత్వం ఎంత అవసరమో తెలియజేశారు. ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు మరో 800 మంది న్యాయమూర్తులు అవసరమని తెలిపారు. ఆర్బిట్రేషన్ రంగంలోకి విశ్రాంత న్యాయమూర్తులు, బ్యూరోక్రాట్లు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, నిపుణులు పాల్గొన్నారు.



న్యాయమూర్తులు, న్యాయ నిపుణులతో సిఎం చంద్రబాబు

జైలు వార్డర్‌పై సుత్తితో దాడి

చోడవరం సబ్ జైలు నుంచి ఇద్దరు ఖైదీలు పరార్

ప్రజాశక్తి - చోడవరం : చోడవరం సబ్ జైలు వార్డర్ వీర్రాజుపై సుత్తితో దాడి చేసి రిమాండ్ ఖైదీలు బెజవాడ రాము, నక్క రవికుమార్ శుక్రవారం సాయంత్రం పరారవడం సంచలనమైంది. వారిని పట్టుకునేందుకు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో ఖైదీలను వంట పనికి సాయం కోసం వారి గదుల్లోంచి బయటకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో చోరీ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బెజవాడ రాము వార్డర్ వీర్రాజు తలపై సుత్తితో దాడి చేశాడు. అతని వద్దనున్న తాళాల గుత్తి తీసుకుని లాక్ ఓపెన్ చేసి పరారయ్యాడు. పింఛన్ సొమ్ము కాజేత కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న నక్క రవికుమార్ అదే అదునుగా చూసి రామును పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు నటించి అతనూ పరారయ్యాడు. ఈ విషయమై చోడవరం పోలీసులకు ఫిర్యాదు అందింది.

వార్త 2లో..



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విశాఖ వాసులు, పర్యాటకులు

వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

టిడిపి ప్రజావంచన మానుకోవాలి

వార్త 3లో..

అట్టహాసంగా లా వర్సిటీ స్నాతకోత్సవం

వార్త 2లో..

భక్తిశ్రద్ధలతో 'మిలాద్ ఉన్ నబీ'

వార్త 3లో..



ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి అనిత తదితరులు

ఉపాధ్యాయులను గౌరవించాలి

మంత్రులు అనిత, డోలా

వార్తలు 6లో..

సిఐటియు జిల్లా మహాసభకు

సర్వం సిద్ధం

- చోడవరంలో నేడు, రేపు నిర్వహణ
- గడిచిన కాలంలో ఎన్నో పోరాటాలు, విజయాలు
- కార్మికులకు అండగా నిలిచిన ఎర్రజెండా



సిఐటియు తోరణాలతో ముస్తాబైన చోడవరం

ప్రజాశక్తి - చోడవరం : సిఐటియు అనకాపల్లి జిల్లా 13వ మహాసభలకు చోడవరం సిద్ధమైంది. శని, ఆదివారాల్లో గంగా ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ మహాసభలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి.నాగేశ్వరరావు, సిహెచ్. నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శులు ఆర్‌కెఎస్‌వి. కుమార్, జి.కోటేశ్వరరావు హాజరుకానున్నారు. గడిచిన కాలంలో సిఐటియు కార్మికుల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించింది. విజయాలు సాధించింది. నిర్బంధాలకు ఎదురొడ్డి నిలిచింది. వాటన్నింటినీ సమీక్షించుకుని ఈ మహాసభల వేదికగా భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోనుంది.

నూతన అనకాపల్లి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి ఊపందుకున్న తరుణంలో సుమారు 150కి పైగా ఫార్మా కంపెనీలతోపాటు వివిధ చిన్న, పెద్ద మధ్య తరగతి కంపెనీల్లో అనేక మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారందరికీ సమస్యలు ఎదురైనప్పుడు 'నేనున్నాను' అంటూ అన్ని సందర్భాల్లో సిఐటియు చేదోడువాదోడుగా నిలుస్తూ వచ్చింది. జిల్లాలో అనేక పోరాటాలకు నేతృత్వం వహించింది. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమించింది. సిఐటియు ఆధ్వర్యాన అనకాపల్లిలో చేపట్టిన సమ్మెలు జయప్రదమయ్యాయి. జాతాలు విజయవంత మయ్యాయి. ఫార్మా ప్రమాదాలు, తొలగింపులు, వేధింపులపై నిరంతరం ఆందోళనలు సాగాయి. మున్సిపల్ కార్మికులు, క్లాప్ లోడర్లు, డ్రైవర్ల సమస్యలపై పోరాటాలు నడిచాయి. అచ్యుతాపురం రోడ్డు నిర్మాణంలో నిర్వాసితుల వుతున్న చిల్లర వర్తకుల సమస్యలపైనా ఉద్యమించింది. రాంబిల్లి మండలంలో ఎన్ఎఒబి కార్మికుల సమస్యలపై పోరాడింది. అంగన్‌వాడీ, ఆశా, వెలుగు విఎఎల సమస్యలపై ఉద్యమిస్తూ వారికి భరోసాగా నిలిచింది. స్కీం వర్కర్ల పోరాటంలో ముందంజలో మిగతా 2లో..

అట్టహాసంగా లా వర్సిటీ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం 8, 9, 10, 11, 12 బ్యాచ్‌ల సంయుక్త స్నాతకోత్సవం శుక్రవారం ఉదయం బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్ వేదికగా ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, దామోదర్ సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాష్ విశ్వవిద్యాలయ నివేదికను సమర్పించారు. విద్యార్థులు సాధికారిక, సామాజిక న్యాయం బాధ్యత, భావాలు వారి వృత్తి జీవితంలో కొనసాగించాలని సూచించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి సూర్యకాంత్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం గురువుల దినోత్సవం సందర్భంగా జరుపుతుండడం విశేషమని అన్నారు. న్యాయవృత్తి అత్యంత సవాళ్లతో కూడుకున్నదని, దీనికి మేధస్సుతోపాటు ఆత్మబలం అవసరమని అన్నారు. విద్యార్థులు తమ జీవిత ప్రయాణంలో తల్లిదండ్రులు, గురువులు, మిత్రులు, సహకారాన్ని మర్చిపోరాదన్నారు. నిజాయితీ, స్వీయ అవగాహన, మార్పులను స్వీకరించడం, సొంత ప్రమాణాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగడం వంటి అలవాట్లను అలవర్చుకోవాలని అన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ సమాజంలో జరుగుతున్న మార్పుల పట్ల ఆసక్తి చూపించాలని, సమాజంతో సంబంధాలను నిర్మించుకోవాలని, మార్పుకు దోహదపడాలని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి మహేశ్వరి మాట్లాడుతూ పట్టభద్రుల ప్రయాణంలో సహకరించిన వారిని నిత్యం స్మరించుకోవాలని అన్నారు. న్యాయం కేవలం వృత్తి మాత్రమే కాకుండా సమాజాన్ని మార్చగల శక్తి అని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో మరొక సుప్రీం కోర్టు న్యాయమూర్తి పి.శ్రీనరసింహ, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ద్వారా బి.ఎ.ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎం, పిహెచ్‌డి, ఎల్ఎల్‌డిలలో పట్టభద్రులైన ఐదు బ్యాచులకు చెందిన సుమారు 800 మంది విద్యార్థులకు భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి సూర్యకాంత్ చేతుల మీదుగా డిగ్రీలను ప్రదానం చేశారు.



పట్టాలు అందుకున్న వారితో అతిథులు

మొదటి పేజీ తరువాయి..

సిఐటియు జిల్లా మహాసభకు సర్వం సిద్ధం

ఉంది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడింది. కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ, నిరాహార దీక్షలు వంటి కార్యక్రమాలు చేపట్టింది. ఫార్మా కార్మికుల రక్షణ యాత్ర పేరిట బైకు యాత్ర నిర్వహించింది. ఫార్మా రంగంలో ప్రమాదాలు నివారించాలని, కార్మికులకు భద్రత కల్పించాలని నినదించింది. అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె జిల్లాలో జయప్రదమైంది. పలు డిమాండ్లను నెరవేర్చుకున్నారు. బ్రాండిక్స్ (అధిస్థాన్) కంపెనీలో మహిళా కార్మికుల తరుపున పోరాడింది. యాజమాన్యం దిగివచ్చి అరగంట పని పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. వేతనాలు పెరిగాయి. అభిజిత్ కంపెనీ లే ఆఫ్‌పై పోరాటం, ముఠా కార్మికుల కూలి రేట్ల ఒప్పందం, సాగర్ సిమెంట్ డ్రైవర్ల సమ్మెతో వేతనాలు పెంపుదల వంటివి సిఐటియు విజయాల్లో చెప్పుకోదగ్గవి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపైనా అనేక పోరాటాలు నిర్వహించింది. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేసింది. చోడవరం పరిసర ప్రాంతంలో జరిగిన అనేక పోరాటాలకు సిఐటియు నేతృత్వం వహించింది.



మాట్లాడుతున్న శంకరరావు, చిత్రంలో లోకనాథం తదితరులు

జయప్రదం చేయండి

అనకాపల్లి : శని, ఆదివారాల్లో చోడవరంలో జరిగే సిఐటియు 13వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లోకనాథం, ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ మహాసభల్లో గత మూడేళ్ల కాలంలో కార్మికులు, ఉద్యోగులు సమస్యలపై చేసిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ కుట్రలు ఆపాలి : ఐద్వా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇఒఐ పేరుతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే కుట్రలను తక్షణం నిలిపివేయాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, తొలగించిన 4500 మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఐద్వా విశాఖ జిల్లా కమిటీ తీర్మానించింది. సిఐటియు జగదాంబ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి మాట్లాడారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15న చలోవిజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఆరోజు విజయవాడలో లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి ఉంటుందని భవన నిర్మాణ, కన్‌స్ట్రక్షన్ కార్మికుల యూనియన్ (సిఐటియు) జగదాంబ జోన్ నాయకులు కె.నర్సింగరావు తెలిపారు. సింగ్ హోటల్ జంక్షన్ వద్ద శుక్రవారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చలో విజయవాడ కార్యక్రమానికి హాజరు కావడం కోసం,ఈ నెల 13 నగరంలో భవన నిర్మాణ కార్మికులు విధులకు హాజరు కాకుండా, విజయవాడ వెళ్లడం జరుగుతుందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. బోర్డుకు అవసరమైన నిధులను సమకూర్చడం కోసం గతంలో ఉన్న బిల్డింగ్ సెస్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక నాయకులు సిమ్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పేరు గాంచిన చీరలు, వస్త్రాల ప్రదర్శన,అమ్మకాలను గ్రీన్‌పార్కు హోటల్ లో 5 రోజులు పాటు నిర్వహించే నేషనల్ సిల్క్‌ఎక్స్‌పోను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ ఈ రోజు నుంచి 8వ తేదీ వరకు ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ చీరలు, బ్లౌజులు, కుర్తీలు మొదలైన వాటిని దేశంలోని వివిధ రాష్ట్రాల నేత కార్మికులు 50 శాతం వరకు తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. చీరలు తయారీదారుల నుండి నేరుగా సేకరించినవి ఇక్కడ లభిస్తాయన్నారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని, ప్రవేశం ఉచితం అని తెలిపారు. డెబిట్, క్రెడిట్ కార్డులు చెల్లింపులు స్వీకరిస్తారన్నారు.

వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

పెద్ద సంఖ్యలో జనం హాజరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖ జిల్లా పర్యాటక శాఖ, వివిధ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఎంజిఎం మైదానంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. అన్ని రకాల ఆహార పదార్థాలనూ ఇక్కడ అందుబాటులో ఉంచారు. విశాఖ వాసులు, పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చి వంటకాలను రుచి చూశారు. విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్, స్పెషల్ సిఎస్ అజయ్ జైన్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి శ్రీభరత్ మాట్లాడుతూ పర్యాటక రంగంలో ఓపెన్ పాలసీల ద్వారా మరింత అభివృద్ధి జరుగుతుందని, అధిక రెవెన్యూ వస్తుందని అన్నారు. దానికి తగ్గట్టు ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. అజయ్ జైన్ మాట్లాడుతూ వైజాగ్ అంటేనే టూరిజం అని, అందుకే ఈ నగరానికి ముఖ్యమంత్రి అంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడి పర్యాటకుల అభిరుచికి అనుగుణంగా కొత్తకొత్త హోటళ్లు, రిసార్టులు వస్తున్నాయన్నారు. భవిష్యత్తులో విశాఖ కేంద్రంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్యాలెండర్ కూడా రూపొందించామని తెలిపారు. రాష్ట్రంలో 9 మెగా ఈవెంట్లు, జిల్లాల్లో 15 చొప్పున ఈవెంట్లు నిర్వహిస్తామని అజయ్ జైన్ చెప్పారు. విశాఖలో త్వరలోనే పార్టనర్స్ సమ్మిట్, 2026లో వైజాగ్ ఉత్సవాలు జరుగుతాయని, అరకు ఉత్సవాలు కూడా ఉంటాయని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఇక నుంచి వైజాగ్‌లో ప్రతి నెలా ఒక ఈవెంట్ నిర్వహిస్తామన్నారు. అనంతరం స్టార్ చెఫ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన హోటల్స్ చెఫ్‌లకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. తదుపరి అతిథులంతా ఫుడ్ స్టాళ్లను సందర్శించి వంటకాలను రుచి చూశారు. కార్యక్రమంలో టూరిజం శాఖ అధికారులు జె.మాధవి, జగదీష్ పాల్గొన్నారు.

సూపర్ బజార్ ఎమ్‌డిగా శ్రీరామమూర్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్(సూపర్ బజార్) మేనేజింగ్ డైరెక్టర్‌గా పి.శ్రీరామమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఆయన పార్వతీపురంలో జిల్లా సహకార శాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. రెండు నెలల క్రితమే ఆయనకు బదిలీ ఉత్తర్వులు జారీ అయినప్పటికి సాంకేతిక పరమైన కారణాలతో బాధ్యతలు స్వీకరించడంలో జాప్యం జరిగింది.

దుర్గాలమ్మ ఆలయానికి వితరణ

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : పూర్ణా మార్కెట్ 35వ వార్డులో ప్రసిద్ధి చెందిన దుర్గాలమ్మ ఆలయానికి రూ.50 వేల విలువైన శాంసంగ్ ఎయిర్ కండిషన్‌ను దక్షిణ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం తన కుమారుడు సాకేత్ చేతుల మీదుగా బహూకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రెండుసార్లు ఎమ్మెల్యేగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు సేవ చేసానన్నారు.

ఉన్నత విద్యాబోధనతో వికసిత్ భారత్



పద్మశ్రీ సంఘమిత్రను సత్కరిస్తున్న ఎయు ప్రతినిధులు, అతిథులు

- ఎయు సైన్స్ కాన్‌క్లేవ్‌లో పద్మశ్రీ ఆచార్య సంఘమిత్ర బందోపాధ్యాయ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: స్వర్ణాంధ్ర - వికసిత భారత్ 2047 చేరుకోవడానికి ఉన్నతస్థాయి విద్యాబోధన జరగాలని, దీనికి నూతన విద్యావిధానం ఎంతగానో దోహదపడుతుందదనిపద్మశ్రీ అవార్డు గ్రహీత, కోల్‌కతా ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ సంచాలకులు ఆచార్య సంఘమిత్ర బందోపాధ్యాయ అన్నారు. విద్యార్థులకు మంచి మార్గనిర్దేశకంగా విద్యావ్యవస్థలు నిలవాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా బీచ్ రోడ్‌లోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వేదికగా 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్రాంటియర్స్ ఫర్ స్వర్ణాంధ్ర అండ్ వికసిత్ భారత్-2047' అనే అంశంపై కాన్క్లేవ్ నిర్వహించారు. భారతరత్న, భారత పూర్వ రాష్ట్రపతి, ఎయు పూర్వ ఉపకులపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళులర్పించారు.

అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ (ఎఎస్‌టిసి,హైదరాబాద్) సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన కాన్క్లేవ్‌లో ఆచార్య సంఘమిత్ర బందోపాధ్యాయ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపకులపతిగా పనిచేసిన ఆంధ్రవిశ్వవిద్యాలయంలో టీచర్స్ డే వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. దేశానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ అందించిన సేవలను కొనియాడారు. ప్రస్తుత కాలంలో టెక్నాలజీ మనిషిని శాసిస్తుందని, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మనిషికి గట్టి సవాలును విసురు తోందన్నారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో టెక్నాలజీ మీద ఆధారపడకుండా పరస్పరం బృంద చర్చల ద్వారా తమ ఆలోచనలను బదలాయించుకుని నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. అన్ని రాష్ట్రాల పురోభివృద్ధితోనే వికసిత్ భారత్ సాకారమౌతుందన్నారు.

ఐఎండి డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర ప్రత్యేకఅతిథిగా పాల్గొని పద్మవిభూషణ్ డాక్టర్ పి.కోటేశ్వరం స్మారక ఉపన్యాసాన్ని అందించారు. ఫిజికల్, డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, టెక్నాలజీల సహకారంతో వాతావరణ మార్పులను గమనించా లన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (హైదరాబాద్) డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ సమాజ అభివృద్ధికి భారత అతరిక్ష పరిశోధనలు అంశంపై ప్రత్యేక ప్రసంగం అందించారు. ఎయు విసి ఆచార్య జి.పి రాజశేఖర్ ఎయు అభ్యున్నతికి, దేశాభివృద్ధికి సర్వేపల్లి సేవలను కొనియాడారు.

సదస్సులో భాగంగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఎన్ఆర్ఎస్‌సి, హైదరాబాద్‌తో ఎయు అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకుపరిశోధనలకు కావలసిన టెక్నాలజీ, పరికరాలుకు ఎన్ఆర్ఎస్‌సి రూ.1.58 కోట్లను ఎయుకు అందించనుంది. రెక్టార్ ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ కె. రాంబాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హుండీల దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లోని దేవాలయాలలో హుండీలను పగలగొట్టి నగదు, కానుకలు అపహరిస్తున్న నలుగురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సిఐ నమ్మి గణేష్ తెలిపిన వివరాలు ప్రకారం... రెండు నెలలుగా దేవాలయాల్లో జరుగుతున్న దొంగతనాలపై డిఎస్‌పి విష్ణు స్వరూప్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం నియమించి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమాచారం మేరకు మార్టూరు జంక్షన్ వైపు వెళ్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ముగ్గురు మైనర్లు కాగా, ఒకరు కరణం జయంత్, రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామానికి చెందిన వారు. వారిని విచారించగా, రెండు నెలల కాలంగా జోగన్నపాలెం, మార్టూరు, దొరైపాలెం, పైలవానిపాలెం, రాంబిల్లి మండలం వెంకటాపురం తదితర ఐదు దేవాలయాల్లో హుండీలను చోరీ చేసినట్లు చెప్పారు. వారి నుండి రూ.7650 రికవరీ చేసి, వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కొండెంపూడి వద్ద శుక్రవారం బొలెరో వాహనాన్ని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బుచ్చయ్యపేటకు చెందిన కొమార చిరంజీవి, నరేంద్రలు వినాయకుడికి పూలదండల కోసం బైకుపై రావికమతం వెళ్లి తిరిగి వస్తుండగా కొండెంపూడి వద్ద బొలెరో వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కొమార చిరంజీవి తలకు బలమైన గాయాలు కాగా, నరేంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని చోడవరం ఆసుపత్రికి తరలించారు.

హయ్యర్ పెన్షన్ వర్తింపజేయాలి

ప్రజాశక్తి గాజువాక.: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎపిఎఫ్ 95 పెన్షనర్లందరికీ హయ్యర్ పెన్షన్ వర్తించాలని ఎఐటియుసి నాయకులు డి ఆదినారాయణ అన్నారు. శుక్రవారం పెదగంట్యాడ సిడబ్ల్యూసిలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతూ ఇపిఎఫ్ 95 పెన్షనర్లందరికీ డిమాండ్ లెటర్స్ పంపించాలని కోరారు. సిఐటియు నాయకులు వైటి దాసు మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ వర్తించే వరకు ఐక్యంగా పోరాడదామని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జె.అప్పలస్వామి కిల్లా దీనబంధు, కె.హుస్సేన్, కె.పెంటారావు నమ్మి అప్పల నాయుడు, మరిశెట్టి వెంకట్రావు, ఎన్.వి.రమణ ఎస్ అప్పా రావు సన్యాసిరావు, కణితి అప్పలరాజు, రాజు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్నను శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎపి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్, జస్టిస్‌ఆర్.రఘునందన్‌రావు దంపతులు, కేంద్ర ప్రభుత్వ న్యాయ వ్యవహారాల విభాగం కార్యదర్శి డాక్టర్ అంజురతి రాణా,కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి దీప్తి గౌర్ ముఖర్జీ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వర రావు, పర్యవేక్షణ అధికారి త్రిమూర్తులు, అర్చక స్వాములు నాదస్వర, వేదమంత్రాలతో ఘనస్వాగతం పలికారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం స్వామి శేష వస్త్రంతో సత్కరించి జ్ఞాపిక, ప్రసాదాలు అందజేశారు.

మహిళపై ఫిర్యాదు

ప్రజాశక్తి- సీతమ్మధార : నెలసరి సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో ఇళ్లు ఖాళీ చేయమన్నందుకు రూ.ఐదు లక్షలు ఇస్తేనే అంటూ ఒ క మహిళ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఇంటి యజమాని ముద్దాడ శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురుద్వార్ దరి శాంతిపురంలో తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ మూడేళ్ల క్రితం ఇప్పు లక్ష్మి అనే మహిళకు తన ఇంటిని అద్దెకిచ్చానని, కొన్ని నెలలుగా అద్దెడబ్బులు ఇవ్వకపోవడంతో ఇల్లు ఖాళీ చేయమన్నందుకు తిరిగి రూ.ఐదు లక్షలు ఇస్తేనే ఖాళీ చేస్తానని, లేకుంటే ఇళ్లు ఖాళీ చేయబోనని, చేతనైంది చేసుకోమంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. నాలుగు రేకుల ఇళ్లలో ఒకదాంట్లో అద్దెకు ఉంటున్న ఆ మహిళ, మిగిలిన ఇళ్లల్లో ఎవరినీ దిగనీయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు .దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌తోపాటు నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని, వారే తనకు న్యాయం చేయాలని శంకర్ వేడుకుంటున్నాడు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని బోని 33/11కెవి, సిర్లపాలెం 11కెవి ఫీడర్ పరిధిలో శిర్లపాలెం, బోని, ఎజిఎల్ కాలనీ, బోని హెడ్ క్వార్టర్స్, ముకుందపురం, ఎస్ఆర్ కాలనీ, పేకేరు ప్రాంతాల్లో 6న శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంత రాయం కలుగుతుందని ఎఇఇ అప్పలనాయుడు తెలిపారు.

మధురవాడ : ఎన్‌టిఆర్ కాలనీ 11కెవి ఫీడర్, మధురవాడ సబ్ స్టేషన్ 11కెవి వుడా కాలనీ ఫీడర్‌లో .ఱ1, ఱ2, ఱ3 కాలనీలు, నవోదయ స్కూల్, డిఆర్‌కె టౌన్ షిప్, అన్నంరాజు నగర్, సాయి చంద్ర లేఅవుట్, గాయత్రి కాలేజ్ కోఎడ్యుకేషన్, అష్టలక్ష్మి టెంపుల్, పోర్ట్ కాలనీ, ఎన్‌జిఒ కాలనీ, సుద్ద గెడ్డ ఏరియా, వాంబే కాలనీ, శ్రీనివాస్ నగర్, చంద్రంపాలెం, మధురవాడ మెయిన్ రోడ్, దుర్గ నగర్-1,2, కృష్ణనగర్‌లో 6నఉదయం 9 నుంచి విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఇఇ సింహాచలం నాయుడు తెలిపారు.

టిడిపి ప్రజావంచన మానుకోవాలి

తెలుగుదేశం నేతల వ్యాఖ్యలపై సిపిఎం, సిఐటియు నేతల మండిపాటు

ప్రజాశక్తి -గాజువాక : తెలుగుదేశం నేతలు ప్రజా వంచన మాటలు, ప్రకటనలు మానుకుని, విశాఖ ఉక్కు రక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు హితవు పలికారు. స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు సమస్యలపైనా, నిర్వాసితులకు, ప్రజలకు ప్రభుత్వాలు చేస్తున్న ద్రోహంపైనా పోరాడుతున్న సిపిఎం, సిఐటియు నాయకులపై విషం గక్కుతూ ఇటీవల టిడిపి గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు, కార్మికులు, నిర్వాసితుల హక్కులను కాపాడేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, విశాఖ ఎంపీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేస్తున్నారని తప్పుడు మాటలు చెప్పడంతోపాటు, వైసిపి కబంధహస్తాల్లో చిక్కుకుని సిపిఎం, సిఐటియు నేతలు కూటమిపై దుష్ప్రచారం చేస్తున్నారని ప్రసాదుల శ్రీనివాస్ వ్యాఖ్యానించడాన్ని ఖండించారు. . కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇఒఐ పేరుతో స్టీల్‌ప్లాంట్‌ను 46 ముక్కలు చేసి ప్రైవేటుకు కట్టబెట్టాలని చూస్తుంటే మద్దతునిచ్చిన కూటమి నేతలు ఎలా పరిరక్షిస్తుందో చెప్పాలన్నారు. కేంద్రమిచ్చిన రూ..11,440 కోట్ల ప్యాకేజీలో రూ.9,862 కోట్లు జిఎస్‌టి, బ్యాంకు రుణాలు పేరున మోడీ ప్రభుత్వం తిరిగి తమ ఖజానాలో జమ చేసుకుంటే ఏం చేశారని ప్రశ్నించారు. 2200మంది పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికులు, ఐదు వేలమంది కాంట్రాక్టు కార్మికులను ఉక్కు యాజాన్యం తొలగించడమే కాక, వేతనాలు చెల్లింపులోనూ, ఇతరత్రా ఇబ్బందులు పెడుతుంటే ఏం చేశారన్నారు. తొలగించిన కార్మికుల స్థానంలో ఇతర రాష్ట్రాల కార్మికులను జాయిన్ చేసుకుంటూ నిర్వాసితులకు ఉక్కు యాజమాన్యం అన్యాయం చేస్తుంటే ఏం చేశారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అంటూ నిరాహారదీక్ష చేసిన స్థానిక ఎమ్మెల్యే పల్లా, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూర్మన్నపాలెంలోని కార్మికుల దీక్షాశిబిరాన్ని బలవంతంగా తొలగింపుతోపాటు పునరుద్ధరించకుండా పోలీసులు ఆంక్షలు పెడుతుంటే, కార్మికుల ఓట్లతో గెలిచిన ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా మౌనం వహించడమే కాకుండా లోపాయికారీగా మద్దతునివ్వడం ద్రోహం కాదాయని ప్రశ్నించారు. పోలీసు కేసులు, ప్రభుత్వ నిర్బంధాలు పెడుతున్నా, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, అదానీ గంగవరం పోర్టు సమస్యలపై సిపిఎం, సిఐటియు నాయకులు పోరాడుతుంటే, కేంద్రానికి, కార్పొరేట్లకు దాసోహమై, కార్మికులు, ప్రజలకు ఏకంగా ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసింది వైఎస్ఆర్, చంద్రబాబు, జగన్మోహనరెడ్డి ప్రభుత్వాలు కాదాయని ప్రశ్నించారు .దీనిపై ప్రసాదుల శ్రీనివాస్, టిడిపి నేతలు సమాధానం చెప్పాలన్నారు. నాడు వైసిపి, నేడు కూటమి నేతలు ఇలాగే చౌకబారు ప్రకటనలు చేశారని మండిపడ్డారు. సిపిఎం, సిఐటియులపై తప్పుడు ఆరోపణలు చేస్తే దాని ప్రభావం వారిపైనే ఉంటుందన్న నిజాన్ని గమనించాలన్నారు. టిడిపి నేతలకు సత్తా ఉంటే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిధుల ద్వారా మోడీపై ఒత్తిడి తెచ్చి ఇఒఐ, స్టీల్ ప్రైవేటీకరణ రద్దు చేయించాలని డిమాండ్ చేశా. మోసపూరితంగా వ్యవహరిస్తే, ప్రజలే తగిన శాస్తి చేస్తారని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో 'మిలాద్ ఉన్ నబీ' వేడుకలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఈద్ ఎ మిలాద్-ఉన్-నబిని ముస్లిం సోదరులు విశాఖలో ఘనంగా జరుపుకున్నారు. సీరత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు వివిధ మసీదులకు చెందిన ముస్లింలు భారీగా తరలివచ్చి నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్ప్రింగ్ రోడ్డులోని రిజర్వు లైన్ మసీదు వద్ద ప్రారంభమైన శాంతి ర్యాలీ డాల్ఫిన్ జంక్షన్, మహిళా కళాశాల జంక్షన్, సెవెన్ హిల్స్ జంక్షన్, జగదాంబ జంక్షన్ మీదుగా వన్ టౌన్ కోటవీధిలోని హజ్రత్ ఇషాక్ మదిని ఔలియా రహితుల్లాలై దర్గా వరకు సాగింది. ర్యాలీలో తెల్లటి గుర్రాలు, ఒంటెలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీరత్ కమిటీ అధ్యక్షుడు మునీర్ ఖాన్ బాబా, ప్రధాన కార్యదర్శి జిలానీ, కోశాధికారి అసిఫ్, కార్పొరేటర్ బర్కత్ అలీ, కాంగ్రెస్ నేత హైదర్ అలీ సింకా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇషాక్ వ్యవస్థాపకులు షబ్బీర్, రఫీ మాట్లాడారు. ర్యాలీ అనంతరం ఇషాక్ మదిని ఔలియా రహమతుల్లా అలై దర్గా వద్ద ముస్లిం మత గురువులు ఫాతిహా నిర్వహించారు. ర్యాలీకు హాజరైన ముస్లిములకు నిర్వాహకులు తబరుక్ పంపిణీ చేశారు.

సీతమ్మధార : జివిఎంఎం 53వ వార్డు జాకీర్ హుస్సేన్ నగర్ మస్జిద్ ఈ అల్ ఖదీర్, మర్రిపాలెం మస్జిద్ ఈ అల్ పత ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ, మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు ముస్లిములు ఘనంగా నిర్వహించారు. మస్జిద్‌ల వద్ద ఖురాన్ పఠించారు.మక్కా మదీనా నమూనాలు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం దావత్ నిర్వహించారు.

నక్కపల్లి:మండలంలోని ముస్లిం గ్రామాల్లో ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలను నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ముస్లిం గ్రామాలైన పెద్దబోధిగల్లం, రామకృష్ణాపురం, పెద్ద దొడ్డిగల్లు, అప్పలపాయకరావుపేట గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేకంగా ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు..ర్యాలీగా నక్కపల్లి చేరుకుని జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, పెదబోధిగల్లం సర్పంచ్ ఫాతిమా మున్నీషా, అజీమ్, ముస్లిం మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట నూర్ మసీద్‌లో మిలాద్ నబీ వేడుకలను శుక్రవారం ముస్లిములు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముందుగా నూర్ మసీద్ అధ్యక్షులు షేక్ రెహమాన్ (బాబర్) ఆధ్వర్యాన బయ్యవరం దర్గా నుండి కశింకోట నూర్ మసీదు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అబ్దుల్ ఖలీమ్ ఆజాద్, మౌలానా నసీం అక్తర్, ఎస్.ఎం.ఎం.ఆలీ, ఎం.ఎ.రబ్బానీ, నూర్ నబీ, ముస్తఫా ఆలం, ఫజిల్ రహ్మన్, ఐ.ఎం.షరీఫ్, సయ్యద్ సలీం, అధిక సంఖ్యలో ముస్లిములు పాల్గొన్నారు.


నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

11న విశాఖ ఉక్కు పరిరక్షణ బహిరంగ సభ

జయప్రదం చేయండి

- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు పిలుపు
- త్రినాధపురంలో ఇంటింటా కరపత్రాల పంచుతూ ప్రచారం



త్రినాధపురంలో పాదయాత్రలో పాల్గొన్న జగ్గునాయుడు, ఇతర నేతలు

ప్రజాశక్తి-ములగాడ : ప్రయివేటీకరణ బారి నుంచి విశాఖ ఉక్కు పరిరక్షణకు ఈనెల 11న పాత గాజువాకలో నిర్వహించే బహిరంగ సభలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గు నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం జివిఎంసి 62వ వార్డు , త్రినాధపురంలో సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ, ప్రచార పాదయాత్రను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావంతో పారిశ్రామిక ప్రాంతంతో పాటు విశాఖపట్నం బాగా అభివృద్ధి చెందిందని, లక్షలాదిమందికి ఉపాధి లభిస్తోందన్నారు. అటువంటి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుకు అమ్మేందుకు కేంద్రంలో మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు అదే జరిగితే హిందుస్తాన్ జింక్ వలే మూతపడి, లక్షలాది మందికి ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, ఈ ప్రాంత అభివృద్ధి పూర్తిగా కుంటుబడడం తోపాటు భవిష్యత్ తరాలకుఉపాధి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కుతో ప్రతి కుటుంబానికి అనుబంధం ఉందని దీన్ని పరిరక్షించుకుని ప్రభుత్వ రంగంలో కాపాడుకోవడం కీలకమన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు రూ.11440 కోట్లు ప్యాకేజీ ఇచ్చామని, లాభాలు బాట పట్టిస్తామని మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రభుత్వాలు చెబుతున్నాయని, అయితే ఆ నిధులు ఇచ్చినట్లే ఇచ్చి జిఎస్‌టి పేరుతో .రూ. 9842 కోట్లను తిరిగి జమ చేసుకున్నారన్నారు. మిగిలిన నిధులను స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కాకుండా అప్పులు తీర్చడానికి, ఉపయోగించారన్నారు 30ఏళ్లుగా పనిచేస్తున్న 5000 మంది కాంట్రాక్ట్ కార్మికులను చట్ట విరుద్ధంగా తొలగించి, వీరి స్థానంలో ఇతర రాష్ట్రాల కార్మికులతో పనిచేయించడం దుర్మార్గమన్నారు.

మోడీ ప్రభుత్వ దుర్మార్గాన్ని గత వైసిపి ప్రభుత్వం ఆపలేకపోయిందని, తాము అధికారంలోకి వస్తే విశాఖ ఉక్కును, కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటామని నమ్మించి, ప్రజల ఓట్లతో గెలిచిన కూటమి నేతలు ఇపుడు మాట నిలబెట్టుకోకపోగా, అన్యాయానికి దన్నుగా నిలుస్తున్నారని మండిపడ్డారు. ప్రజా పోరాటాన్ని ఉధృతం చేసి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్కాపురం జోన్ కార్యదర్శి పి పైడిరాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ నిలిచిపోయిందని విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యేలు ప్రకటించి ప్రజలను మభ్యపెడుతున్నారని, చిత్తశుద్ధి ఉంటే ఇదే ప్రకటన మోడీ ప్రభుత్వంతో చేయించాలని డిమాండ్ చేశారు. 62వ వార్డు పార్టీ నాయకులు పి .రామారావు,ఎల్. కృష్ణ,బి.అర్జునరావు, జి గణేశ్వర రావు, బి ప్రసాద్, టి అప్పారావు, పి సురేష్ కుమార్, ఆర్ తాతబాబు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లనుఆవిష్కరిస్తున్న స్టీల్ సిఐటియు నేతలు

ఉక్కునగరం: విశాఖ ఉక్కు పరిరక్షణకు గాజువాకలో ఈనెల 11న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. దీనిపై స్టీల్‌జోన్‌లో అన్ని వార్డుల్లో పోస్టర్లు, పాదయాత్రలు, ఇంటింటా కరపత్రాల పంపిణీ, గ్రూపు మీటింగ్‌ల ద్వారా ప్రచారం చేసి ప్రజలను పెద్దఎత్తున సమీకరించాలని పిలుపునిచ్చారు.

12న సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని 11న ఉదయం మద్దిలపాలెంలో ఏచూరి భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, వైటి.దాస్, శ్రీనివాసరాజు, వివి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఏడు నెలల వేతన బకాయి చెల్లించాలి

సిఐటియు ఆధ్వర్యాన సినర్జీస్ కార్మికుల ఆందోళన


కంపెనీ గేటు ఎదుట నిరసన చేస్తున్న కార్మికులు.

ప్రజాశక్తి- గాజువాక: ఏడు నెలల వేతన బకాయి తక్షణమే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలోసినర్జీస్ కార్మికులు శుక్రవారంకంపెనీ గేటు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం రాంబాబు, గాజువాక ప్రధాన కార్యదర్శి ఎల్ బంగారు నాయుడు, జిల్లా ట్రెజరర్ ఎస్ జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ ఏడు నెలలుగా వేతనాలు చెల్లించకుంటే కార్మికుల కుటుంబపోషణ ఎలా సాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సినర్జీస్ కంపెనీలో పనిచేస్తున్నా, తినడానికి తిండి లేక, పిల్లలకు స్కూలు ఫీజులు కట్టలేక, అత్యవసర పరిస్థితుల్లో వైద్యానికి ఆసుపత్రులకు వెళ్లలేక కార్మికులంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పిఎఫ్ బకాయిలు కట్టకుండా, బోనస్ చెల్లించకుండా కంపెనీ యాజమాన్యం చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికుల వేతన బకాయి చెల్లింపుతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిరసనలో యూనియన్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, కార్యదర్శి దాసు, ట్రెజరర్ బషీర్ పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని ఊరేగింపు


ఊరేగింపులో పాల్గొన్న గోవింద్, నిర్వాహకులు

ప్రజాశక్తి- సీతమ్మధార: సీతంపేట దుర్గా గణపతి ఆలయంలో గణనాథుని నవరాత్రి ఉత్సవాల భాగంగా గణనాథుని పల్లకిలో ఊరేగింపు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోలాటం, గరిడీ, డప్పుల డాన్స్, నృత్య ప్రదర్శన, పులి వేషాలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సీతంపేట, కృష్ణుడు గుడి, మూడు గుళ్ళు, రెల్లివీధి, కనకమ్మ వారి వీధి ప్రాంతాల మీదుగా ఊరేగింపు సాగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపల్లి గోవిందు, శ్యామల దీపిక కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎఎల్ఎస్ సౌకర్యంతో 108 వాహనం

ప్రజాశక్తి -గాజువాక : భవ్య హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ (ఎఎల్ఎస్) వ్యవస్థ కలిగిన రెండు 108 వాహనాల్ని ఎపి ప్రభుత్వం విశాఖకు కేటాయించిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గాజువాక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వీటిని ప్రారంభించారు. 'ప్రీ హాస్పిటల్ కేర్' సదుపాయం ఉన్న 108 వాహనాన్ని రోగులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాత వాహనాల స్థానంలో కొత్తవి రావడం ఆనందదాయకమన్నారు. 108 వాహన జిల్లా మేనేజర్ ఎం. సురేష్ అభ్యర్థన మేరకు త్వరలో ఆ సిబ్బందికి షెల్టర్ సమకూరుస్తామని, వాహనం పెట్టుకునేందుకు స్థలం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు కార్యక్రమంలో జిల్లా మేనేజర్ ఎం సురేష్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ సయ్యద్ సమీర్, మరియు అంబులెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

68 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు, జీరుపేటలో,మధురవాడ నియో విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్ర వారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణులు బాలకృష్ణ పాల్గొని 68 మందికి కంట పరీక్షలు చేశారు.15 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరికి తమ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. కార్యక్రమంలో క్యాంప్ మేనేజర్ పవన్ కుమార్, టెక్నీషియన్, సిబ్బంది పాల్గొన్నారు

బస్సులు నిలుపుదల చేయకపోవడంపై

కట్టలు తెగిన జనాగ్రహం

- నరసాపురంలో రోడ్డెక్కి ధర్నా : బస్సులను అడ్డగించి ఆందోళన


బస్సులు అడ్డగించి ధర్నా చేస్తున్న నరసాపురం ప్రజలు

ప్రజాశక్తి -పద్మనాభం : కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలోకి తెచ్చినప్పటి నుంచి తన కూడలిలో ఆర్‌టిసి బస్సులు నిలుపుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలంలోని తుని వలస గ్రామపంచాయతీ నరసాపురం గ్రామస్తులు శుక్రవారం విజయనగరం, సింహాచలం బస్సులను అడ్డగించారు. దాదాపు 60మంది గ్రామస్తులు రోడ్డెక్కి ఉదయం 8:30 గంటల నుంచి దాదాపు రెండు గంటలపాటు రోడ్డుపై బస్సులను అటకాయించి ధర్నా చేసి నిలిపివేశారు. గతనెల 15నుంచి తమ సెంటర్‌లో బస్సులు నిలుపుదల చేయకపోవడంతో అటు విజయనగరం, ఇటు విశాఖ వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయనగరంలో దుకాణాల్లో పనిచేసేవారు, భవన నిర్మాణ కార్మికులతోపాటు విద్యార్థులంతా బస్సులు నిలుపుదల చేయకపోవడంతో గడచిన ఇరవై రోజులుగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అంతేకాక విజయనగరం నుంచి నరసాపురం వచ్చే విద్యార్థినిని రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో తమ సెంటర్‌లో బస్ ఆపమన్నా ఆపకుండా రెడ్డిపల్లిలో దింపేయడంపై మండిపడు తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఆర్‌టిసి యంత్రాంగం స్పందించి, బస్ సర్వీసులను క్రమబద్ధీకరించి, నరసాపురం జంక్షన్‌లో అన్ని బస్సులు నిలుపుదల చేసేలా చర్యలు చేపట్టాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేయక తప్పదని హెచ్చరిస్తున్నారు.

అలకనంద టౌన్ షిప్ ఐదో కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న సంస్థ డైరెక్టర్ నాగరాజు

ప్రజాశక్తి- విశాఖపట్నం : నగరంలోని ఎన్ఎడి కూడలి వద్ద అలకనంద టౌన్ షిప్ ఐదవ నూతన కార్యాలయాన్ని శుక్రవారం సంస్థ డైరెక్టర్ వాసుపల్లి నాగరాజు ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, విశాఖపట్నంలో 450 పైబడి రియల్ ఎస్టేట్ కంపెనీల్లో ఐదోస్థానంలో ఉన్న అలకనంద టౌన్ షిప్, వంద లేఅవుట్లను పూర్తిచేసుకుని కస్టమర్ల ఆదరభిమానాలు, గుర్తింపు పొందిందన్నారు. జివిఎంసి, నగర పరిధిలో నరవ వద్ద ఐదు ఎకరాల్లో ఈ నెలలో కొత్త లేఅవుట్‌ను వేసి కస్టమర్లకు ఇవ్వబోతున్నామన్నారు. ఐదో కార్యాలయం ప్రారంభం సందర్భంగా వినియోగ దారులకు, సంస్థ సిబ్బందికి మార్కెటింగ్ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్స్ వాసుపల్లి భవాని ప్రసాద్, వాసుపల్లి రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సాగు పైర్ల పరిశీలన

ప్రజాశక్తి- ఆనందపురం :మండలంలోని తర్లువాడ గ్రామంలో ప్రకృతి విధానంలో సాగుచేస్తున్న పంటలను శుక్రవారం ఉత్తరాంధ్ర జిల్లా అధికారి హేమసుందర్‌తోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్ రాష్ట్రాల వ్యవసాయాధికారుల బృందం ప్రత్యక్షంగా పరిశీలించింది. ఎన్ఎఫ్ఎహెచ్ ఆర్.శ్రీనివాస చక్రవర్తి రైతుపొలంలో ప్రకృతి సాగులో వివిధ మోడల్స్, పిఎండిఎస్ కార్యకలాపాలను,ఎటిఎం మోడల్ సాగు విధానాన్ని అధికారులకు వివరించారు. ఈ విధానంలో సాగుతో భూమిపరిరక్షణతోపాటు పైర్లకు చీడపీడల బెడద లేకుండా ఏడాది పొడుగునా ఆదాయం వచ్చే ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చన్నారు. ఈసందర్భంగా కూరగాయల సాగులో అవలంబిస్తున్న 'ఎ'గ్రేడ్ మోడల్ విధానాన్ని మోడల్ మేకర్ రామారావు అనేరైతు తన అనుభవాలను వివరించారు.

ఆరు తడి వరి సాగుపై అవగాహన

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోనిఅయినాడా, కోరాడ, మజ్జిపేట, దాకమర్రి, మద్ది, గంధవరం, కొవ్వాడ, కొర్లపల్లి తదితర ఎనిమిది గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న రైతులకు ఆరుతడి వరి సాగుపై క్షేత్రస్థాయిలో ఆర్‌టిఎల్ ప్రకాష్ శుక్రవారం అవగాహన కల్పించారు. పంట పొలంలో ఏ సమయంలో నీటి తడి అందించాలో సూచించే ఫీల్డ్ వాటర్ ట్యూబ్ పరికరాన్ని అమర్చడం, దాన్ని వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు వివరించారు. దీని ద్వారా సాగునీటి ఆదాతోపాటు పైరు పిలకల శాతం పెరిగి, అధిక దిగుబడులు వస్తాయన్నారు. పొలం పొడిగా మారితే నివసించే కొన్ని కీటకాలు, శిలీంద్రియాల ద్వారా వ్యాధుల వ్యాప్తి అరికట్టడంతోపాటు విద్యుత్ శక్తిని కూడా ఆదా చేసుకోవచ్చని సూచించారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పరిశీలన

ప్రజాశక్తి- సీతమ్మధార : మధురవాడ పిహెచ్‌సి, వాంబేకాలనీలోని యుపిహెచ్‌సిలను శుక్రవారం డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. అక్కడ జరుగుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు,ఒపి, ఐపి, ఇహెచ్ఆర్ డయాగ్నొస్టిక్ సేవలు, మందులు, ఆర్‌బిఎస్‌కె, ఆర్‌కెఎస్‌కె సేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆభ ఐడి మ్యాపింగ్ శతశాతం సాధించాలని ఆదేశించారు ఫ్రైడే-డ్రైడే అమలు తీరును పరిశీలించారు. దోమలు, లార్వా వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు ఇవ్వడాన్ని వ్యతిరేకించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్‌లో 10 కొత్త వైద్య కళాశాలలను పిపిపి (ప్రైవేట్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్) పద్ధతిలో నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో మెడికల్ కాలేజీ ఇప్పటికే భవనాలు గత ప్రభుత్వం హయాంలోనే నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయని, వీటిని పూర్తి చేసి వైద్య సేవలు వెంటనే ప్రారంభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. నేడు కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా ప్రైవేట్ వాళ్లకు అప్పగించాలని పిపిపి పద్ధతిని అమల్లోకి తెచ్చిందని విమర్శించారు. దీనివల్ల పేదవారికి వైద్య సేవలు దూరం అవ్వడంతో పాటు అభివృద్ధి కుంటుపడుతుందని పేర్కొన్నారు. ప్రజల పన్నుల డబ్బులతో నిర్మించిన వైద్య కళాశాలలను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం అంటే వైద్య విద్యను వ్యాపార వస్తువుగా మార్చడమే అవుతుందని తెలిపారు. పిపిపి మోడల్ అనుభవం ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా విఫలమైందని, దీని వల్ల పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు డాక్టర్ చదువు అందని ద్రాక్షగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ ఫీజులు, కాపిటేషన్ ఫీజు పేరుతో డబ్బులు వసూలు చేస్తూ, వైద్య విద్యను సంపన్న వర్గాలకే పరిమితం చేయనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య విద్య, ఆరోగ్యం ప్రజా హక్కులను ప్రైవేటు లాభాల కోసం తాకట్టు పెట్టడం సరైనది కాదని హితవుపలికారు. ప్రభుత్వమే కొత్త మెడికల్ కాలేజీలను పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే నడపాలని డిమాండ్ చేశారు.



జగ్గప్పారావును సత్కరిస్తున్న దృశ్యం

పిఎసిఎస్ పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా జగ్గప్పారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా శరగడం జగ్గప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ప్రభుత్వ పర్సన్ ఇన్‌ఛార్జి ఎం.నీల వెంకటేశ్వరరావు జగ్గ అప్పారావుకు బాధ్యతలను అప్పగించారు. డైరెక్టర్లుగా కాండ్రేగుల రమణ, బీశెట్టి గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు పీలా తులసిరాము, సర్పంచ్ సరగడం భాగ్యలక్ష్మి బాపు నాయుడు, ఉపసర్పంచ్ బీశెట్టి రాము, గ్రామ నాయకులు శరగడం లక్ష్మి జగ్గారావు, కాండ్రేగుల సూర్యనారాయణ, ఎం సూర్యనారాయణ, కాండ్రేగుల అప్పారావు, కె.జోగి నాయుడు, కర్రి ఆదిబాబు, కె.రమేష్ బాబు, సంఘ సీఈవో ఐ.సూర్య మహేశ్వరరావు పాల్గొన్నారు.

చింతకింది శ్రీనివాసరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ప్రాంతానికి చెందిన ప్రముఖ కథ, నవల రచయిత డాక్టర్ చింతకింది శ్రీనివాసరావును శుక్రవారం చోడవరం వాకర్ ఫ్రెండ్స్ హెల్త్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓరుగంటి రాంబాబు, జాజుల జగ్గారావు మాట్లాడుతూ శ్రీనివాసరావు మీడియా ప్రపంచంలో వివిధ హోదాల్లో పనిచేస్తూ ఎన్నో కథలు, వ్యాసాలు, నాటకాలు రచించారని తెలిపారు. ఆయన రాసిన కథలతో సినీ దర్శకులు క్రిష్ దృష్టిలో పడి హరిహర వీరమల్లు సినిమాకు మాటలు, అరేబియా కడలి టివి సిరీస్ రచించారని తెలిపారు. అనుష్క కథానాయకగా నటించిన ఘాటీ సినిమాకు కథ అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు దేవరపల్లి నవకుమార్, ఎంవి స్వామి, పివీఎస్ గుప్తా, గోపి, వి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి ఆధ్వర్యాన 'మేధో ప్రతియోగిత'

ప్రజాశక్తి-పరవాడ : ఎన్‌టీపీసీ సింహాద్రి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4, 5 తేదీలలో రీజినల్ స్థాయి మేధో ప్రతియోగిత పవర్ క్విజ్ పోటీలు నిర్వహించారు. వీటిని సింహాద్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ హెడ్ ఆఫ్ ప్రాజెక్ట్ సమీర్‌శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ఈ పోటీల ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవాలని సూచించారు. ముందుగా హెచ్‌ఆర్ హెడ్ బిబి.పాత్రా, క్విజ్ మాస్టర్ గౌతమ్ బోస్ జట్లు, ప్రేక్షకులను స్వాగతించారు. దక్షిణ ప్రాంతానికి చెందిన ఎన్‌టీపీసీ ప్రాజెక్టులు, ప్రాంతీయ ప్రధాన కార్యాలయం తరపున మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయి. నాలుగు విభాగాలలో జరిగిన మేధో ప్రతియోగితతో పాటు ఉద్యోగుల విభాగంలో పవర్ క్విజ్ కూడా నిర్వహించారు. ఈ ప్రాంతీయ స్థాయి విజేతలు జాతీయ స్థాయి మేధో ప్రతియోగిత, పవర్ క్విజ్‌కు హాజరు కానున్నారు. కార్యక్రమంలో సీనియర్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాల నివారణకు డ్రోన్ కెమెరాల సాయంతో స్థానిక పోలీసులు నిఘా చర్యలు చేపడుతున్నారు. కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రోన్‌ను ఎగరవేశారు. చుట్టుపక్కల గ్రామాల్లోనూ, శివారు ప్రాంతాలు, తోటల్లోనూ డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం గంజాయి వినియోగం, చైన్ స్నాచింగ్ వంటి చట్టవ్యతిరేక పనులను గుర్తించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు. ప్రజల్లో చట్ట పాలనపై నమ్మకం కుదిరేందుకు ఈ డ్రోన్ నిఘా దోహదపడుతుందని చెప్పారు.

శారద నది ఘాట్ పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శుక్రవారం స్థానిక శారదా నది ఘాట్‌ను సందర్శించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సామూహిక నిమజనోత్సవాలు శనివారం భారీగా జరగనున్న నేపథ్యంలో వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తాడి రామకృష్ణ, ఆడారి కుమారస్వామి, దూలం గోపి, ఆళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



శారద ఘాట్ వద్ద ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం

వైసిపి జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్



మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో వైసిపి నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఖరీఫ్ సీజన్లో రైతులకు సకాలంలో ఎరువులు పంపిణీ చేయడం వల్ల ప్రభుత్వం విఫలమైందని, దీనిని ప్రశ్నించిన ప్రతిపక్షం, రైతులపై దాడులకు దిగడం ఎంతవరకు సమంజసమని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రశ్నించారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతు భరోసా కేంద్రాలు, సొసైటీల ద్వారా అందించిన విషయాన్ని గుర్తు చేశారు. వ్యవసాయమే దండగ అని ముఖ్యమంత్రి చంద్రబాబు భావించడం వల్లే రైతులు అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేనప్పుడు అధికారులు ఏం చేస్తారని ప్రశ్నించారు. రైతుల పక్షాన వైసిపి పోరాటంలో భాగంగా ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్డీవో కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, మాజీ శాసనసభ్యులు అదీప్ రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను పూర్తిగా విస్మరించిన కూటమి ప్రభుత్వం

సబ్బవరం : కూటమి ప్రభుత్వం రైతులను పూర్తి విస్మరించిందని, నేడు రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పేర్కొన్నారు. మండలంలోని ఇరువాడ వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ యూరియా రైతులకు అందుబాటులో లేక బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బోకం రామునాయుడు, కోటాన రాము, గండి రవికుమార్, కర్రి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్టు

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లిలో శుక్రవారం సాయంత్రం భారీగా వర్షం కురిసింది. ఈదురు గాలులు కారణంగా వృక్షాలు నేలకొరిగాయి. కొండకొప్పాక వద్ద జాతీయ రహదారిపై చెట్లు పడటంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. 5 కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు ప్రయాణికులు చాలా ఇబ్బంది పడ్డారు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ రవి కుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని చెట్టును రహదారిపై నుంచి తొలగించే చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంతో సుమారు గంట తర్వాత సమస్య తొలగింది.



రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షాన్ని తొలగిస్తున్న దృశ్యం

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-చోడవరం : నియోజకవర్గంలోని పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర గనులు, భూగర్భ, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శనివారం శంకుస్థాపనలు చేయనున్నారనిస్థానిక ఎమ్మెల్యే కెఎస్‌ఎన్ఎస్.రాజు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రూ.8 లక్షలతో వడ్డాది వంతెన కాజ్ వే మరమ్మతులకు, రూ.15 లక్షలతో విజయరామరాజుపేట వంతెన కాజ్‌వే మరమ్మతులకు శంకుస్థాపనలు చేస్తారని చెప్పారు. చోడవరం పంచాయతీ కార్యాలయంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని, చోడవరం హాస్పిటల్‌ను రూ.6 కోట్లతో 100 పడకలు ఆసుపత్రిగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని, 12 గంటలకు బహిరంగ సభ ఉంటుందని, అనంతరం టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ ఉంటుందని తెలిపారు.

9న ధర్నాకు ఆటో కార్మికులు తరలిరావాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఈ నెల 9న జరుగు ధర్నాకు ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు సుంకర జగన్నాథం పిలుపునిచ్చారు. శుక్రవారం చిన్న అప్పన్నపాలెంలో ఆటో కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో తాము ఉపాధి కోల్పోయామని, ఆటో కార్మికులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఓ.శ్రీను, సుంకర శ్రీను, రామకృష్ణ, గాడి అప్పలస్వామి, కొల్లి శ్రీను పాల్గొన్నారు

కొనసాగుతున్న వరి నాట్లు

ప్రజాశక్తి-కోటవురట్ల : సెప్టెంబర్ నెల వచ్చినా మండలంలో ఇంకా వరి నాట్లు కొనసాగుతున్నాయి. వాస్తవానికి ఖరీఫ్ వరి సాగు ఆగస్టు 15 నాటికి పూర్తి కావాల్సి ఉన్నా ప్రారంభంలో వరుణుడు ముఖం చాటేయడంతో దమ్ములు, ఉడుపులు జరగలేదు. అయితే ఆగస్టు 15 తరువాత వర్షాలు కురవడం, ఈ వర్షాలకు తాండవ డ్యామ్‌లో నీళ్ల పుష్కలంగా ఉన్నా మండలానికి చివరి ఆయకట్టుకు చేరేందుకు ఆలస్యం కావడంతో నేటికీ ఉడుపులు ప్రక్రియ కొనసాగుతుంది. దుర్గాడ ఆయకట్టు కింద ఉడుపులు దాదాపు పూర్తయ్యాయి. మండల వ్యవసాయ అధికారి సరోజిని ఇచ్చిన వివరాల ప్రకారం మండల వ్యాప్తంగా 1700 హెక్టార్లకు గాను దాదాపు 1320 హెక్టార్ల వరకు నాట్లు పూర్తయ్యాయి.



వరి నారు తీస్తున్న మహిళా రైతులు

యూరియా కొరత లేకుండా చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతులకు యూరియా కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు అన్నారు. తుమ్మపాల మేజర్ పంచాయతీలో రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రైతుల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని యూరియా సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, జనసేన నాయకులు పీలా తాతునాయుడు, చదరం చిన్న, గాలి జగదీష్, పీలా విశ్వేశ్వరరావు, వ్యవసాయ అధికారి రంగాచారి, డిటి శాంతి భూషణ్, సిబ్బంది పాల్గొన్నారు.



రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

నేడు ఉపకరణాలకు నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి-పరవాడ

పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, అలింకో సంస్థ సంయుక్తంగా 0 నుండి 18 సంవత్సరాలలోపు వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు పంపిణీకి గుర్తింపు వైద్య నిర్ధారణ శిబిరం శనివారం ఉదయం 9 గంటల నుండి అనకాపల్లి మున్సిపల్ టౌన్ గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు పరవాడ ఎంఇఒలు దివాకర్‌రావు, సాయి శైలజ, భవిత ఉపాధ్యాయులు టి.కుమారి, జి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక వైకల్యం గల విద్యార్థులకు మోటరైజ్డ్ బ్యాటరీ ట్రై సైకిల్స్, వీల్ చైర్లు, ట్రై సైకిల్స్ సిపి చైర్లు, రొలెటర్స్, వాకర్స్, వినికిడి లోపం గల విద్యార్థులు వినికిడి యంత్రాలు, దృష్టిలోపం ఉన్నవారికి బ్రెయిలీ కిట్స్, మేధో వైకల్యం వారికి ఎంఆర్ కిట్స్ ఉచితంగా అందించడానికి ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాలకు చెందిన విద్యార్థులు దీనికి హాజరు కావాలని సూచించారు. శిబిరానికి వచ్చే వారు సదరం సర్టిఫికెట్, యూడి ఐడి కార్డు, రేషన్ కార్డు/ ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు, 2 పాస్ పోర్టు సైజ్ ఫోటోలు తీసుకొని రావాలని కోరారు. శిబిరానికి వచ్చిన పిల్లలకు, తల్లిదండ్రులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎపిటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విఆర్ఆర్.పేట తులసీ కళ్యాణ మండపంలో జరిగిన ఎపిటిఎఫ్ సర్వసభ్య సమావేశంలో మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.శేషుకుమార్, సిహెచ్.మధుకృష్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.వెంకటపతిరాజు, తమరాన త్రినాథ, ధర్మరావు దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను స్థానిక కూటమి నాయకులు శనివారం పంపిణీ చేశారు. మండలంలోని తుమ్మపాలకు చెందిన కోన పద్మావతికి రూ.31,626, ఊడేరు పంచాయతీ అల్లికానుడి పాలెం సిరిగిరిశెట్టి మణికి రూ.73,122, దిబ్బపాలెం దొడ్డి ఆదిలక్ష్మికి రూ.20 వేలు, కూండ్రం వలివిరెడ్డి లక్ష్మికి రూ.20వేలు చొప్పున చెక్కులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, జనసేన నాయకులు గంగపాం జగదీష్, బంటు రవి, సర్పంచులు పీలా అప్పారావు, సిరిగిరిశెట్టి మోహన్, పల్లెల గణేష్, పి.తాతు నాయుడు, పీలా విశ్వేశ్వరరావు, ఇంటి తాతారావు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జీవీఎంసీలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. పిఎస్ హెచ్ఎంలుగా పదోన్నతి పొందిన ఎం.ఉమామహేశ్వరరావు, వి.కృష్ణమోహన్, బి.రామాంజనేయులు, స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందిన ఎ.లలిత తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు టి వెంకటరమణ, ఎన్ శ్రీనుబాబు, పెనుమత్స కృష్ణంరాజు, సాగర్ పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కేపీ అగ్రహారం సచివాలయంలో శుక్రవారం 220 బస్తాల యూరియాను రైతులకు అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గోపాల్, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో బానోజీరావు, మండల వ్యవసాయ అధికారి బి.భాస్కరరావు పాల్గొన్నారు.



యూరియా గొడౌన్ పరిశీలిస్తున్న అధికారులు

ఉపాధ్యాయులను గౌరవించాలి

రాష్ట్ర మంత్రులు అనిత, డోలా

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. స్థానిక ఎస్ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి గురుపూజోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ విద్యా విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనలో మార్పులు తీసుకురావాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రతి పాఠశాలలో యూత్ క్లబ్, సైన్స్ క్లబ్, మాదకద్రవ్యాల నిరోధక కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గురుపూజోత్సవం సందర్భంగా 39 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించారు. వీరిలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఆరుగురు, స్కూల్ అసిస్టెంట్లు 20 మంది, ఎస్‌జిఎస్‌టిలు 13మంది ఉన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, మళ్ల సురేంద్ర, ఆర్‌డిఒ షేక్ ఆయిషా, డిఇఒ జి.అప్పారావునాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో ఉన్న సర్వేపల్లి విగ్రహానికి కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు శ్రీధరాల కృష్ణ పేర్రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు తదితరులు పాల్గొన్నారు. తుమ్మపాల జెడ్‌పి హైస్కూల్‌లో విద్యా కమిటీ, విద్యార్థులు కలిసి పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరామస్వామి, హెచ్ఎం శ్రీపతి శంకర్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఎంఇఒలు ఎస్.లక్ష్మణరావు, ఎంజె.రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఎంపిపి బోకం సూర్యకుమారి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజా, తహశీల్దారు బి.చిన్నికృష్ణ, స్థానిక సర్పంచ్ దెడ్డెం ప్రసాదరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులు గురువులను ఘనంగా సన్మానించారు. పండ్లు పుష్పగుచ్ఛాలు అందించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఐవివి సత్యవతి, డాక్టర్ రత్నభారతి, బి.పిచ్చమ్మ పాల్గొన్నారు

కె.కోటపాడు : స్థానిక అయ్యన్న విద్యా సంస్థలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి, చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీంను ఉపాధ్యాయులను, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. విద్యా సంస్థల తరపున ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బసు పోతనను, పరిపాలన అధికారి దాట్ల చంద్రశేఖరవర్మను సత్కరించారు. "అపుస్మా" ప్రదానం చేస్తున్న జిల్లా స్థాయి అవార్డులకు తమ పాఠశాల నుంచి ఎం.సత్యవతి, కె.చంద్రకళ, జి.అప్పారావు, ఎస్.కళ్యాణి, బండారు చెల్లారావు నామినేట్ అయ్యారని, వీరికి 13న ఎయులో అవార్డులు ప్రదానం చేస్తారని తెలిపారు.

దేవరాపల్లి : స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఉపాధ్యాయులు పూలమాలలతో నివాళులర్పించారు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని అత్యంత వైభవంగా జరుపుకున్నారు.

కోటవురట్ల : మాకవరపాలెం మండలంలోని అవంతి కళాశాలలో అధ్యాపకులను కళాశాల వ్యవస్థాపకులు, చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విజయనగరం జెఎన్‌టియు ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, ఐవిఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం భార్గవి విద్యా మందిర్ పాఠశాలలో కరస్పాండెంట్ డి.రవి ఆధ్వర్యాన సర్వేపల్లికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. యాజమాన్య ప్రతినిధులు రవి, వరలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, అరుణ, రత్నం, గోవింద్, ప్రశాంతి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట పిఎసిఎస్ ఆవరణలో విశ్రాంత ఎంఇఒ శిష్టా తమ్మిరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు బి.వెంకటరమణ, బి.నాయుడులను పిఎసిఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి శరగడము జగ్గా అప్పారావు చేతుల మీదుగా శిష్యులు సాలువాలు కప్పి జ్ఞాపకలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కె.సూర్యనారాయణ, ఎస్ శివబాపునాయుడు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలికి అవార్డు అందిస్తున్న మంత్రి డోలా, ఎంపీ శ్రీభరత్

నాతవరం : మండల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కారక సత్యనారాయణ, స్థానిక ప్రజా ప్రతినిధులు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేజీబీవీ, శాంతినికేతన్ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కాపారపు అప్పలనరస, సర్పంచ్ గొలగను రాణి, ఎంఈఓలు బ్రహ్మాజీ వరహాలు బాబు, పిఎసిఎస్ చైర్మన్ మాణిక్యం పాల్గొన్నారు

రావికమతం : గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం నవోదయ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ చంద్రశేఖర్ పట్నాయక్‌ను సత్కరించారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

ఎంవిపి.కాలనీ : విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలిగి వారిని సక్రమ మార్గంలో నడిపించవలసిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఎయు అంబేద్కర్ అసెంబ్లీ హాల్‌లో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలలో నూరు శాతం ఉత్తీర్ణులయ్యే విధంగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, డిఇఒ ప్రేమ్ కుమార్, ఎపిసి చంద్రశేఖర్, డిప్యూటీ డిఇఒ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మిలీనియం ఆధ్వర్యాన..

మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యాన ద్వారకానగర్ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ సెంట్రల్ మేనేజర్ వరదా రవి కుమార్ మాట్లాడారు. సీనియర్ ఫ్యాకల్టీ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎయు ఆచార్యులు ప్రేమానందం

విశాఖ కలెక్టరేట్ : ఉపాధ్యాయులు సమాజాన్ని మంచి మార్గంలో నడిపించే బాధ్యతను, సామాజిక స్పృహను కలిగి ఉండాలని ఎయు రాజనీతి శాస్త్ర, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ పి.ప్రేమానందం పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, బిఎన్ఆర్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుస్తకాలు చదివించడం మాత్రమే చదువు కాదని, ఉన్నత జీవన విధానం నేర్పించాలని అన్నారు. నగరంలో సేవా దృక్పథంతో సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, రాష్ట్ర బిసి స్టడీ సర్కిల్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు, అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అభిమన్యు, డాక్టర్ జి.ప్రియాంక, బుజ్జి, రోటరీ అధ్యక్షులు రఘుపతి, గాంధీ పాల్గొన్నారు.

గాజువాక : టిఎస్ఆర్ అండ్ టిబికె ఆపిల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఎయు మాజీ రిజిస్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. సంతోషికి ఆపిల్ రత్న అవార్డు కింద రూ.25వేల నగదును ఉత్తమ ఉపాధ్యాయులు వై విజయశ్రీ, వి ఎస్ నాయుడు, ఇంద్ర తులసి, హరీష్‌కు ఒక్కొక్కరికి రూ.పదివేల నగదును అందజేశారు .కళాశాల చైర్మన్ బలరామకృష్ణ, కరస్పాండెంట్ టి ఉమామహేశ్వరరావు, సెక్రెటరీ టి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఆస్ విష్ణువర్ధనరావు పాల్గొన్నారు.

విశాఖపట్నం : కంచరపాలెం గిరీష శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు., వివిధ పోటీల్లో విజేతలకు ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ రవికుమార్ అవార్డులను, బహుమతులను అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ అనురాధ, విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మధురవాడ : గీతం నాలెడ్జి రీసోర్సు సెంటర్ లో సర్వేపల్లి రాధాకష్ణన్ విగ్రహానికి గీతం విసి ఎరోల్‌డిసౌజా నివాళులర్పించారు. ప్రోవిసి ప్రొఫెసర్ వై.గౌతమరావు, ఉపాధ్యక్షుడు ఎమ్.గంగాధరరావు, డాక్టర్ బి.గీతాంజలి,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ప్రొఫెసర్ వేదవతి, గీతం లైబ్రేరియన్ డాక్టర్ శివప్రసాద్ పాండా పాల్గొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.ఎస్.వి.జయశ్రీని సత్కరించారు. మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్వర్యంలోఉపాధ్యాయ దినోత్సవంలో విశ్రాంత హెచ్ఎం ఎం.రాజబాబు దంపతులను సత్కరించారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి సురేఖ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ విష్ణు మూర్తి, పాల్గొన్నారు.

తగరపువలస: అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సెంచూరియన్ వర్సిటీ ఛాన్సలర్ జిఎస్ఎన్.రాజు, ప్రొఫెసర్ పివి రమణమూర్తి, కళాశాల ప్రిన్సిపల్స్ బి మురళీకృష్ణ, పూర్ణ నాగ శ్రీ, బి జగదీశ్వర రావు పాల్గొన్నారు


పద్మనాభం : రేవిడి పంచాయతీ ఆంధ్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పాఠశాల నిర్వాహకులు నాయుడు ఆధ్వర్యంలో సర్వేపల్లికి నివాళులర్పించారు.ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.



కె.కోటపాడు అయ్యన్న స్కూల్‌లో పూలమాల వేస్తున్న దృశ్యం



మాకవరపాలెం అవంతిలో సత్కరిస్తున్న ముత్తంశెట్టి



బహుమతి అందిస్తున్న మాజీ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు

బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయొద్దు

- ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి



మాట్లాడుతున్న వరలక్ష్మి

ప్రజాశక్తి -నక్కపల్లి: పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయవద్దని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి డి.వరలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజయ్యపేట ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును విరమించు కోవాలన్నారు. ఇప్పటికే హెటిరో డ్రగ్స్ కాలుష్యం కారణంగా సముద్రంలో మత్స్యసంపద నశించి మత్స్యకారులు ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డారన్నారు. ఈ ప్రాంతంలో వేట సాగక వలసలు పోతున్నారని అన్నారు. కంపెనీ కాలుష్యం కారణంగా గ్రామంలో క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు బారినపడి అనేకమంది మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు యు.నాగమణి, చంద్రకళ, మహిళలు పాల్గొన్నారు.

గిరిజన మహిళ మృతికి

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

-వంతెన నిర్మించక పోవడంతోనే ప్రమాదం - ఆదివాసీ మహిళ మృతదేహంతో నిరసన



మహిళ మృతదేహంతో నిరసన చేపడుతున్న గిరిజనులు

ఒచీశీఅవ ప్రజాశక్తి మాడుగుల: అజయపురంలో ఆదివాసీ గిరిజన మహిళ పాంగి మచ్చమ్మ మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్డ్ సాధన కమిటీ జిల్లా ప్రదాన కార్యదర్శి ఇరట. నరసింహమూర్తి డిమాండ్ చేసారు. గురువారం అజయపురం గ్రామానికి చేందిన పాంగి మచ్చమ్మ పివిటిజి ఆదివాసీ మహిళ కూలి పని చేసుకోని తాచేరు గెడ్డపై కర్రలతో తాత్కాలికంగా గిరిజనులు నిర్మించుకున్న వంతెనపై కాలు జారీ ప్రమాదవశాస్తు గెడ్డలో పడి మరణించిందని తెలిపారు. ఈ మృతిపై మాడుగుల పోలీసులు కేసు నమోదు చేసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం చేసి తీసుకు వచ్చిన శవంతో శుక్రవారం అజయపురం వెళ్ళే తాత్కాలిక వంతెనపై శవంతో రెండు కిలోమీటర్లు దూరం మొసుకోని వెళ్లి గిరిజనులు నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం తాడిపత్రి పంచాయతీ శివారు అజయపురం గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని అనేక సార్లు ప్రభుత్వానికి, అదికారులకు మొరపెట్టుకున్న పట్టించు కోకుండా ఆదివాసీల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం చేసారని తెలిపారు.దీంతో గిరిజనులు తాటిపర్తి అజయపురం గ్రామానికి మద్యలో గెడ్డపై కర్రలతో కాలిబాట వంతెన నిర్మించుకున్నారని తెలిపారు. దీనిపై గురువారం సాయంత్రం కాలుజారి గెడ్డలో పడి చనిపోడం జరిందన్నారు. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి గిరిజనులు ప్రాణాలు పోగొట్టు కుంటున్నారని తెలిపారు.శంకరం పంచాయతీలో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. తాడివలస కొత్తవలస బ్రిడ్జిలు నిర్మించక పోవడంతో గత సంవత్సరం అనారోగ్యంతో కోత్తవలస గెడ్డ దాటలేక గెడ్డలోనె గిరిజన యువకుడు మరణించాడని తెలిపారు.మాడుగుల మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించక పోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా గిరిజన గ్రామాలకు రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించి గిరిజనుల ప్రాణాలు కాపాడాలని వారు కోరారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హోం మంత్రి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని డి.ఎల్.పురం-1 పాఠశాల ఉపాధ్యాయులు కాళింగ సతీష్, దేవవరం పాఠశాల ఉపాధ్యాయులు డి ఆర్ కె శాస్త్రిలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అనకాపల్లిలో హెూంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, డీఈఓ గిడ్డి అప్పారావు నాయుడు చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేసి, సత్కరించారు.

గొలుగొండ: మండలం జోగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయులు తమ్మిల మాణిక్యం, చోద్యం వ్యాయామ ఉపాధ్యాయులు టీవీ.రమణలకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు చేతుల మీదుగా వీరు అవార్డులను అందుకున్నారు. గొలుగొండ ఎంఇఒలు సత్యనారాయణ, కృష్ణప్రసాద్, హెచ్ఎం నాగభూషణం తదితరులు అభినందించారు.

సబ్బవరం : మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన గురు పూజోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఎంఇఒలు ఎస్.లక్ష్మణరావు, ఎంజె.రవీంద్రబాబు ఆధ్వర్యాన ఎంపిపి బోకం సూర్యకుమారి, ఎంపీడీఓ పి.పద్మజ, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ చేతుల మీదుగా సత్కరించారు. అవార్డులు పొందిన వారిలో అర్జీ.గోవిందం (గంగవరం స్కూల్), బొబ్బ వెంకటరెడ్డి (రాయపుర అగ్రహారం), పైల దేముడు (ఒమ్మివానిపాలెం), కె.అశోక్ కుమార్ (జాగరపువానిపాలెం) ఎస్సార్ఎంఎల్ ప్రసాద్ (వంగలి), తోటకూర కళ్యాణి (వెదుళ్ళ నరవ), పి.మాధురి (పైడివాడ), బోండా పావని (సబ్బవరపు అగ్రహారం), కెఎన్పి రాణి (నాయనమ్మపాలెం), ఆరిపాక ఉమ (బాటజంగాలపాలెం) ఉన్నారు.

కె.కోటపాడు : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా కె.కోటపాడు జెడ్పి హైస్కూల్ తెలుగు స్కూల్ అసిస్టెంట్ మండల మురళీకృష్ణ అనకాపల్లిలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చేతులమీదుగా అందుకున్నారు. మురళీకృష్ణ ఉద్యోగ బాధ్యతలతో పాటు స్థానిక సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యునిగా, బాల వికాస్ కేంద్రం గురువుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మురళీకృష్ణకు అవార్డు రావడం పట్ల హెచ్ఎం ఎస్వి పద్మావతి, ఉపాధ్యాయులు, సత్యసాయి భజన మండలి, సంఘమిత్ర ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని గొల్లలపాలెం పాఠశాల ఉపాధ్యాయుడు వంటాకు శ్రీనివాసరావు, ఆర్.దేముడు బాబు, కే బంగారయ్య, బి.అప్పలనాయుడు తదితరులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు.

మధురవాడ : జివిఎంసి ఐదోవార్డు మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్బి విజయ్కుమార్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. శుక్రవారం ఏయు సమావేశం మందిరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి నుంచి అవార్డు స్వీకరించారు.విజయకుమార్ను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, విద్యాశాఖాధికారులు, పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభినందించారు



అవార్డు స్వీకరిస్తున్న విజయకుమార్

ఎన్ఎస్ఆర్ఐటి అధ్యాపకులకు సిఎస్ఆర్ అవార్డులు

ఆనందపురం : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటి అధ్యాపకులు ప్రతిష్టాత్మక సీఎస్ఆర్ అవార్డులను వరించాయి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఇండస్ట్రీ, ఇనిస్టిట్యూట్ ఎంగేజ్మెంట్ హెడ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ఎన్.ఇ. నవీన్, ఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బి. శివప్రసాద్ ఇద్దరూ .జెఎన్టియు .జివి, విజయనగరం ఉపకులపతి ప్రొఫెసర్ రాజలక్ష్మి సమక్షంలో సిఎస్సి అకాడమీ ఇండియా డైరెక్టర్ రామ్మోహన్ నుంచి అవార్డులు స్వీకరించారని. కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ డాక్టర్. ఎస్. శంభుప్రసాద్ తెలిపారు.

భీమునిపట్నం : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన జివిఎంసి మూడో వార్డు పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం తిరుమల శ్రీదేవి న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి శుక్రవారం అవార్డు అందుకున్నారు. ఎయులో జరిగిన టీచర్స్డే వేడుకల్లో చిప్పాడ జెడ్పీ హై స్కూల్ గణిత ఉపాధ్యాయులు విజయ్ కుమార్ జిల్లా ఇంచార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

గాజువాక: : విశాఖపట్నం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గాజువాక మండల శాఖ అధ్యక్షులు ఇమంది ప్రసాద్, సహధ్యక్షులు మహమ్మాద్ అబ్దుల్ హాక్ ఎంపిక కావడం పట్ల మండల శాఖ కార్యవర్గం సంతోషం వ్యక్తం చేశారు,. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల దినోత్సవాన్నీ పురస్కరించుకొని విశాఖలో జిల్లా కలెక్టర్, పార్లమెంట్ సభ్యులు భరత్, శాసన మండలి సభ్యులు చిరంజీవి, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.



అవార్డు స్వీకరిస్తున్న ప్రసాద్, అబ్దుల్ హాక్



హాజరైన ఉద్యోగులు, ఏజెంట్లు

ఘనంగా ఎల్ఐసి వార్షికోత్సవం

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో ఎల్ఐసీ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు, ఏజెంట్లు, అధికారులు పాల్గొని వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం ఐసీఈయూ బేస్ యూనిట్ ప్రెసిడెంట్ కే కేశబద్రం పడాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్.కోట డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ కేశవరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తూ కోట్లాది ప్రజలకు భద్రతా కవచంలా నిలుస్తోందన్నారు. ఉద్యోగులు, ఏజెంట్ల కష్టంతో పాటు వినియోగదారుల నమ్మకం కారణంగానే ఈ స్థాయికి ఎదిగిందన్నారు. భవిష్యత్తులో మరింత ప్రజల మన్ననలు పొందే విధంగా సేవలను విస్తరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సిహెచ్ శ్రీనివాసరావు, అసోసియేషన్ లీడర్ ఎర్రన్న, శ్రీరామ్మూర్తి, చెన్నయ్య ఎల్ఐసి సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.

రేషన్ పాయింట్ ఏర్పాటుపై అభినందనలు

ప్రజాశక్తి- రావికమతం: సిపిఎం పోరాట ఫలితంగా మండలంలోని చీములపాడు పంచాయతీ జెడ్ .జోగంపేటలో రేషన్ పాయింట్ ఏర్పాటు చేసిన అధికారులకు గిరిజన నాయకులు వంతల చిరంజీవి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో శివారు గ్రామాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే చాలా ఇబ్బంది కరంగా ఉండడంతో దీనిని రెవెన్యూ అధికారుల దృష్టికి తెలియపరిచామన్నారు. స్పందించిన అధికారులు జెడ్ జోగంపేట గ్రామంలో రేషన్ పాయింట్ ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు.

ఎన్టిఆర్ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి : రావికమతం: ఎన్టీఆర్ మహానేత అని భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు కొనియాడారు.. రావికమతం మండలం కిత్తంపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, రూ. 2 కే కిలో బియ్యం, పక్కా ఇళ్లు.. పెన్షన్లు వంటి పథకాలను ఎన్టిఆర్ ప్రవేశ పెట్టారన్నారు. చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, గృహ నిర్మాణ శాఖ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గునూరు మల్లు నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోమటి శంకరావు, నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, టిడిపి పార్టీ వైస్ చైర్మన్ సాలాపు రమేష్, సెక్రెటరీ ఉగ్గిన శ్రీను, కళ్యాణపులోవ వైస్ చైర్మన్ పెద్దిరెడ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గంటా

డ్రోన్లతో ప్రత్యేక పర్యవేక్షణ

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని దారమఠం, గొలుగొండ ప్రాంతాల్లో నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్ఐ పీ.రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం డ్రోన్లతో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ముగ్గురిని గుర్తించి పట్టుకున్నారు. గంజాయి రవాణా, వినియోగం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు అయితే వాటిని డ్రోన్ సాయంతో గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రేవతమ్మ అన్నారు.



మాట్లాడుతున్న సిఐ

రక్తదాతలకు స్పీకర్ అభినందనలు



ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నియోజకవర్గ, ఇతర ప్రాంత ప్రజలు తనపై చూపించిన అభిమానం వెలకట్టలేనిదని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఒక ప్రకటనలో మీడియాకు తెలియజేశారు. తన జన్మదినం సందర్భంగా నర్సీపట్నంలో అభిమానులు రికార్డు స్థాయిలో రక్తదానం చేశారన్నారు.. మొత్తం నాలుగు స్థలాలలో రక్తదాన కేంద్రాలు ఏర్పాటు చేసి 1046 యూనిట్ల రక్తాన్ని సేకరించారని కోనియాడారు.తన పుట్టినరోజు సందర్భంగా ఎవరు ఊహించని విధంగా ఇంతకుముందున్నడూ లేని స్థాయిలో రక్తదానం చేసిన అభిమానులకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేనన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన గ్రామ, మండల, మున్సిపాలిటీ నాయకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



మాట్లాడుతున్న గోవిందరావు

బిసి హాస్టల్‌లో ఆర్‌ఒ ప్లాంట్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట బిసి హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కే.గోవిందరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రోలుగుంట బిసి హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. రోలుగుంట గ్రామాన్ని ఫ్లోరైడ్ గ్రామంగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఇక్కడ ఆర్వో ప్లాంట్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరి ఇబ్బందుల దృష్ట్యా తక్షణమే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు.



యూరియాను పరిశీలిస్తున్న అధికారులు

యూరియా పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో నక్కపల్లి, కాగిత, గునుపూడి రైతు సేవా కేంద్రాలను ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు సందర్శించి, రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. శుక్రవారం పలు రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డి సీతారామరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వో, మహిళా పోలీస్‌లతో యూరియా పంపిణీ పై సమీక్షించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా స్టాక్‌ను పరిశీలించారు. యూరియా వాడకంపై రైతులకు పలు సూచనలు చేశారు.

గొలుగొండ: మండలంలోని పాతమల్లంపేట పంచాయతీలో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత లేదని, అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కే.సుధారాణి, టీడీపీ నాయకులు గెడ్డం నానాజీ, వీఆర్వో కృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

బ్రిటిష్ సమాధుల స్థలంలో... అక్రమ కట్టడాలు తొలగించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నంలోని సర్వే నెంబర్ 9లో ఉన్న బ్రిటిష్ సమాధుల స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక సిపిఎం కార్యాలయంలో మాట్లాడుతూ, చారిత్రాత్మక ప్రదేశంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. నర్సీపట్నం డివిజన్ కేంద్రంలో మున్సిపల్ అధికారులు, తహశీల్దార్, ఆర్డీవో వంటి ఉన్నతాధికారులు ఉన్నారని, ఈ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమే కాకుండా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న వారికి అనుకూలంగా మాట్లాడటం దుర్మార్గమన్నారు. కొత్తగా నిర్మాణాలు చేపడితే వాటిని తొలగించాలని కోర్టు ఇచ్చిన ఉత్తర్వు లను కూడా ధిక్కరిస్తూ అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. నర్సీపట్నం ప్రాంతంలో అల్లూరి పోరాట స్ఫూర్తిగా ఉన్న ప్రాంతంలో అక్రమ కట్టడాలు జరుగుతుంటే చోద్యం చూస్తున్నారన్నారు. కుటుంబ బతుకు కోసం రోడ్డు పక్కన చిన్న దుకాణం పెట్టుకుంటే తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు ఒకేచోట ప్రభుత్వ స్థలం ఉన్న ప్రాంతంలో షాపింగ్ మాల్ కడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కోర్టు ఉత్తర్వులు అమలు చేసి అక్రమ కట్టడాలను తొలగించకపోతే దీనికి బాధ్యులపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అడిగర్ల రాజు, పి.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

మెడికల్ కాలేజీల నిర్వహణలో.. పిపిపి విధానంపై పునరాలోచించాలి

-మాజీ ఎమ్మెల్యే గణేష్



ప్రజాశక్తి -నర్సీపట్నం: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీ నిర్మాణాలను పిపిపి పద్ధతిలో నిర్వహించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలపడం తగదని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు, శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రజారోగ్యంపై రాజకీయం వేదికగా చేసుకోవడం తగదని స్వాతంత్రం వచ్చిన తర్వాత రాష్ట్రంలో 2019 వరకు కేవలం 11 మెడికల్ కళాశాలలో మాత్రమే ఉండేవన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వైద్యం, విద్య అందుబాటులోకి తీసుకువచ్చేందుకు 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టారన్నారు.ప్రధానంగా పాడేరు, నర్సీపట్నం ప్రాంతాల్లో ఒక్కొక్క కాలేజీకి 500 కోట్లను కేటాయించి నిర్మాణ పనులు దాదాపు 50 శాతం పూర్తయ్యాయన్నారు. 630 పడకల ఆసుపత్రిలో 150 మంది వరకు వైద్య విద్యను అభ్యసించే విధంగా నిర్మాణం చేపడుతున్న మెడికల్ కాలేజీ అర్ధాంతరంగా ఆపి, రాజకీయం చేయడం తగదన్నారు. ప్రధానంగా ఈ ప్రాంతం నుంచి విశాఖకు వెళ్లి వైద్యం పొందేందుకు సుమారు మూడు గంటల వరకు ప్రయాణించి ఇబ్బందులు పడుతున్నారన్న ఉద్దేశించి ఏజెన్సీ ప్రాంతానికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వస్తుందని ఆలోచనతో నిర్మాణం చేపడితే కూటమి ప్రభుత్వం పిపిపి విధానాన్ని క్యాబినెట్లో ప్రవేశపెట్టడంతో మెడికల్ సీట్లు అమ్మకానికి చేపట్టినట్లేనని, ఇది ఎంత మాత్రం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు మెడికల్ కాలేజీ నిర్మాణం పట్ల వ్యంగ్యంగా మాట్లాడడం ఎంతవరకు సబవన్నారు. మెడికల్ కాలేజీ మంజూరు కాకుండా నిర్మాణం చేపట్టారని బాధ్యత రాహిత్యంగా మాట్లాడడం తగదని దాదాపు 50 శాతం పూర్తయిన నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపివేసి నిర్మాణ సామగ్రిని తరలించుకుపోవడం పట్ల ఈ ప్రాంత ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు,

పంచాయతీ పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కశింకోట : పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెంబర్ 2160597 ప్రకారం రూ.4 వేలు చొప్పున అందించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా పంచాయతీ ఆఫీసు నుండి మండల పరిషత్తు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ధర్మారావుకు, ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపిడిఒ తోటరావుకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం రోజుల క్రితం జిల్లా పంచాయతీ అధికారిని కలిసి వినతిపత్రం ఇవ్వగా, డిపిఒ సందీప్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పటికే చాలా పంచాయితీలలో 4 నెలల (మే నుండి ఆగస్టు వరకు) బకాయి వేతనాలు ఇంకా అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులపై కక్ష సాధింపు చర్యలు అరికట్టాలని, సబ్బులు, కొబ్బరి నూనె, గ్లౌజులు, బూట్లు, వంటి రక్షణ పరికరాలు, పని సామాగ్రి ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.కొండబాబు, జి.చంద్రశేఖర్, డి.సూరిఅప్పారావు, వై.సన్యాసమ్మ, వై.అప్పలకొండ, డి.పోలయ్య, చిలకమ్మ, శివ, కె.సత్యారావు, అర్జునమ్మ, ప్రకాష్, నూకరత్నం, కె.అప్పారావు, అప్పలనరస, సత్యనారాయణ, అంజి, నారాయణ పాల్గొన్నారు.



కశింకోట పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

లా వర్సిటీ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన అకాడమిక్ బ్లాక్-2 భవనాన్ని సుప్రీంకోర్టు జడ్జ్ జస్టిస్ పి.శ్రీనరసింహ, హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ శుక్రవారం ప్రారంభించారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, దేశ మొదట దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు వాతావరణం మార్పు, చట్టంపై ఎండోమెంట్ లెక్చర్‌ను హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అందించారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ తమ వంతు బాధ్యత నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ డి సూర్య ప్రకాష్‌రావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్సిటీలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి

యూరియా కొరత లేదు

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలంలో ఎలాంటి యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని టిడిపి కూటమి నాయకులు అన్నారు. మండలంలోని తాళ్లపాలెం ఎరువులు షాపు ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కశింకోట, తాళ్లపాలెం ఎరువులు షాపుల్లో యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. యూరియా కొరత అంటూ వైసీపీ నేతలు దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. సమావేశంలో కూటమి నాయకులు కర్రి సత్య నారాయణ, ఉగ్గిని రమణ మూర్తి, ఉల్లింగల రమేష్, కర్రి గోవింద, అప్పికొండ అప్పారావు, కలిగట్ల సింహాద్రి, ముచ్చిపల్లి చిరంజీవి పాల్గొన్నారు.